ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 22 జనవరి 2025



"మంత్రి లేఖ" బట్టబయలు





- మిర్చి యార్డు కార్యదర్శి తీరు వివాదాస్పదం
- రహస్యంగా ఉంచాల్సిన లేఖతో హైకోర్టులో పిటిషన్
- ఆంజనేయులపై ప్రభుత్వ ఉన్నతాధికారులు సీరియస్
- విచారణకు మార్కెటింగ్ డైరెక్టర్ విజయసునీత ఆదేశాలు

గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఓ అంశానికి సంబంధించి మంత్రి.. అధికారులకు రాయగా దానిని రహస్యంగా ఉంచాల్సిన అధికారులే బహిర్గతం చేశారు. ఈ విషయం ప్రస్తుతం గుంటూరు మిర్చియార్డు వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ వివాదంలో గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆంజనేయులు చిక్కుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో అత్యంత గోప్యత కలిగిన ఫైల్‌లోని లేఖను సంపాదించడం, దాన్ని బహిర్గతం చేయడంపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆయనపై సీరియస్‌గా ఉన్నారు.

ఆ లేఖ ఎలా వచ్చింది...

వ్యవసాయ శాఖా మంత్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరికి రాసిన లేఖ బయటకు ఎలా వచ్చిం దన్న దానిపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. పేషీలో ఉన్న ఫైల్ లోని లేఖ బయటకు రావడంపై అధికారులు ఖంగుతున్నారు. ఎవరు ఎవరికి ఈ లేఖను ఇచ్చారన్న దానిపై విచారణ జరిపించి చర్యలు చేపడతామని అధికారులు చెబుతున్నారు. సదరు లేఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి కార్యాలయం నుంచే బయటకు వచ్చిందని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి-1964 ప్రకారం ప్రతి ఉద్యోగి అధికారిక విషయాలను బహిర్గతం చేయకూడదు. మంత్రులు, ఆయా శాఖల ముఖ్య కార్యదర్శి అనుమతి లేకుండా వారికి సంబంధించిన విషయాలను, ఉత్త ర్వుల ను, లేఖలను వెల్లడిచేయడం తీవ్రంగా పరిగణిస్తారు. ఈ పరిస్థితుల్లో గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి వ్యవహారంలో ఏ పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి.


దీనిపై రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయసునీత కూడా మంగళవారం స్పందించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరికి పంపిన లేఖ ఏ విధంగా బయటకు వచ్చిందనే దానిపై విచారణ జరిపిస్తామని చెప్పారు. కొద్దిరోజులుగా గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు వ్యవహారంలో తీవ్ర సందిగ్ధం నెలకొంది. రాజమండ్రి వ్యవసాయ మార్కెట్ యార్డులో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరిగా ఉన్న ఆంజనేయులు 2023 డిసెంబరులో అంతకంటే తక్కువ స్థాయి కలిగిన నరసరావుపేట యార్డుకు డిప్యూటేషన్ వేయించుకున్నారు. అక్కడ పనిచేస్తూనే 2024 అక్టోబరు 27న గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమితులయ్యారు. అయితే పూర్తి స్థాయిలో ఖాళీగా ఉన్న అదే పోస్టు కోసం తాజాగా గ్రూపు-1 అధికారి చంద్రిక ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. చంద్రికను గుంటూరు యార్డు కార్యదర్శిగా నియమించాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీ రామారావు వ్యవసాయ శాఖ మంత్రికి సిఫార్సు చేశారు. ఆ సిఫార్సులను ఆధారం చేసుకుని విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని 2024 డిసెంబరు 2న వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరికి మంత్రి ప్రత్యేకంగా లేఖ రాశారు. అయితే తాను ఇన్‌చార్జిగా ఉన్న పోస్టులోకి చంద్రిక వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న సంగతి తెలుసుకున్న ఆంజనేయులు పావులు కదపడం ప్రారంభించారు.

హైకోర్టులో రిట్ పిటిషన్..

గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆంజనేయులు అనూహ్యంగా ఈ నెల 8న రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో వ్యవసాయ శాఖ మంత్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరికి రాసిన లేఖను పొందుపరిచారు. మంత్రి, కీలక అధికారి మధ్య గోప్యంగా ఉన్న లేఖను ప్రభుత్వ ఉద్యోగి బయటకు తీసుకురావడం వివాదాస్పదమైంది. మొదట్లో కేసు ఫైల్ చేసిన సందర్భంగా అధికారులు ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అయితే అందులో రహస్యంగా ఉంచాల్సిన లేఖ జత పర్చినట్లు తేలడంతో సీరియస్ అవుతున్నారు. ఆంజనేయులు కోర్టులో ఫైల్ చేసిన రిట్ ప్రతిని తెప్పించుకుని అందులో పొందుపరిచిన లేఖను పరిశీలిస్తున్నారు.

నాడు ఆపసోపాలు.. నేడు అభ్యర్థనలు

వైసీపీ హయాంలో ధాన్యం సేకరణ ఒక ప్రహసనంగా జరిగింది. అరకొరగానే లక్ష్యం నిర్దేశించగా దానిని పూర్తి చేసేందుకు రైతు లు ఆపసోపాలు పడేవారు. నగదు ఎప్పటికి వస్తుందో తెలియక.. రైతులు బహిరంగ మార్కెట్లో నష్టానికి విక్రయించుకున్నారు. అదే ఇప్పుడు ప్రభుత్వం నిర్దేశించి ధాన్యం సేకరణ లక్ష్యం రోజుల వ్యవధిలోనే ముగిసింది. నగదు వెంటనే జమవుతుండటం.. నిబంధనల సడలింపులతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి అనుమతులపై సానుకూల స్పందన రావాల్సి ఉంది.



- నిర్దేశించిన లక్ష్యం మేర ఇప్పటికే సేకరణ పూర్తి
- అదనంగా సేకరణకు ప్రతిపాదనల ఆమోదంలో జాప్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్నదాతల అవస్థలు
- అయినకాడికి దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్న రైతులు
- మిల్లుల్లో నిల్వ చేసుకున్న ధాన్యం విషయంలోనూ తకరారు

అనుమతిస్తే.. అమ్ముకుంటాం

పొలాల్లో ఇంకా లక్షల టన్నుల ధాన్యం

లక్ష్యం మేరకు ధాన్యాన్ని అధికారులు సేకరించారు. ఇప్పటికే ధాన్యం సేకరణ లక్ష్యం ముగిసి ఐదు రోజులు అవు తుంది. అయినా ఇంకా లక్షల టన్నుల ధాన్యం పొలాల్లో ఉంది. ఇప్పటికే కోత లు కోసిన ధాన్యం మరికొంత రైతుల వద్ద ఉంది. ఈ పరిస్థితుల్లో సేకరణకు మరి కొంత అను మతిస్తే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల స్థాయిలో అదనపు అనుమతి కోసం అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అనుమతిలపై జాప్యం జరుగుతుండటంతో రైతులు ధాన్యాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు విక్రయించుకుంటున్నారు. ఇదే అవకాశంగా దళారులు ధర ను ఇష్టం వచ్చినట్లుగా తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్ట పోతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో నష్టానికి ధాన్యాన్ని విక్రయించి అప్పుల నుంచి బయట పడుతున్నారు. ప్రభుత్వం ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేస్తుండడం.. తేమ శాతంలో కొంత సడలింపు.. తదితరాలతో కొనుగోలు కేంద్రాలకు ఈ సారి భారీగా ధాన్యం రావడం.. అతికొద్ది రోజుల్లో నిర్దేశించిన మేర లక్ష్యం పూర్తి అయింది. ఇంకా దాదాపు నాలుగో వంతు దిగుబడి రావాల్సి ఉంది. ఈ పరిస్థితు ల్లో సత్వరం ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లాలో 50,000 టన్నులు.. గుంటూరు జిల్లాలో 27 వేల టన్నులు.. పల్నాడు జిల్లాలో 5 వేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. అయితే ఆయా జిల్లాలో ఆ మేరకు ధాన్యం సేకరణ పూర్తి చేశారు. అయినా ఇంకా కల్లాల్లో, పొలాల్లోనే పనల రూపంలో, ఇప్పటికే కోతలు పూర్తి చేసి రైతులు నిల్వ చేసుకున్న ధాన్యం లక్షల టన్ను ల్లో ఉంది. అయితే నిర్దేశించిన లక్ష్యం పూర్తి అయిందని ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించడంలేదు. ఈ పరిస్థితుల్లో మద్దతు ధర విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదనంగా ధాన్యం సేకరణకు అనుమతి ఇవ్వాలనే ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో దళారులకు అయినకాడికి అమ్ముకుని రైతులు నష్టపోతున్నారు. మద్దతు ధరకు ధాన్యం సేకరణ విషయంలో బాపట్ల జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం పూర్తయి ఇప్పటికే 5 రోజులు గడిచింది. మరో 25,000 టన్నుల ధాన్యాన్ని కొనేలా అనుమతి ఇవ్వాలంటూ ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి రెండు వారాల క్రితమే పంపారు. గుంటూరు జిల్లాలో తొలుత పదివేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని నిర్దేశించగా తర్వాత రెండు విడతలుగా మరో 17,000 టన్నుల సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మరో 8,000 టన్నులకైనా అనుమతి ఇవ్వాలని అన్నదాతలు అభ్యర్థిస్తున్నారు. పల్నాడు జిల్లాలో అదనంగా మరో 30,000 టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు కోరారు. తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ధాన్యం అదనపు సేకరణకు ఆమోదించినా.. ఎంత పరిమాణం, ఎప్పుడన్న దానిపై స్పష్టత కొరవడింది. మరోవైపు ఇదే అదనుగా దళారులు రంగ ప్రవేశం చేసి బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరను మరింతగా పతనం చేసి లబ్ధి పొందే దిశగా సిండికేట్ అవుతున్నారు. ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన రైతులకు లక్ష్యం పూర్తి కావడంతో అక్కడ నిరాశే ఎదురవుతోంది. పంట రైతుల చేతికొచ్చేసరికి మరో వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. గోడౌన్‌లతో పాటు మిల్లుల్లో మరి కొంత ధాన్యం నిల్వ ఉంది.

గడచిన రెండేళ్లను బేరీజు వేసుకుని..

ధాన్యం సేకరణ విషయంలో లక్ష్యాలను నిర్దేశించేటప్పుడు గడచిన రెండేళ్ల ఆధారంగా నిర్దేశించారని సమాచారం. అయితే గడచిన రెండేళ్లలో ఏ ఒక్క ఏడాది కూడా లక్ష్యాలకు మించి ధాన్యం సేకరణ ఏ జిల్లాలోనూ జరగలేదు. నిబంధనల విషయంలో

(మిగతా 8వ పేజీలో)



బాపట్ల ప్రాంతంలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న అన్నదాతలు (పాత చిత్రం)

గీత కార్మికులకు.. 12 మద్యం దుకాణాలు

ఎన్నికల హామీ మేరక పది శాతం కేటాయింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గీత కార్మికులకు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా ప్రక్రియ ప్రారంభించింది. మద్యం దుకాణాల లైసెన్సుల్లో పది శాతం గీత కార్మికులకు కేటాయించడంతో పాటు ఉపకులాల వారీగా ఇచ్చే షాపుల సంఖ్యను పేర్కొంటూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కులాల జనాభా సంఖ్యకు 2016లో చేసిన స్మార్ట్ పల్స్ సర్వేని ప్రామాణికంగా తీసుకున్నారు. గీత కులాలను మూడు కేటగిరీలుగా విభజించి షాపుల కేటాయింపు చేపట్టారు. దరఖాస్తుల ప్రక్రియకు సంబంధించి షెడ్యూల్‌ను త్వరలోనే ఎక్సైజ్ శాఖ విడుదల చేయనుంది. జిల్లాలో 12 మద్యం దుకాణాలను గీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో గౌడ్‌కు 4 కాగా, గౌడకు 8 ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపింది. ఒక వ్యక్తికి ఒక దుకాణం మాత్రమే కేటాయించడంతో పాటు కుల ధ్రువీకరణ పత్రం కూడా ప్రభుత్వం తప్పని సరిచేసింది. ఫిబ్రవరి మొదటి వారంలోగా లైసెన్సుల కేటాయింపు జరిపేలా ప్రభుత్వం చూడనుంది. లొకేషన్ల ఎంపికకు సంబంధించి విధివిధానాలను నేడో రేపో ఎక్సైజ్ శాఖ ఖరారు చేయనుంది.

నిజాంపట్నంలో ఎండుచేపల ఫ్యాక్టరీ

స్ఫూర్తి ప్రాజెక్టులో ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్

బాపట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం హార్బర్ అభివృద్ధిలో భాగంగా ఎండు చేపల ఫ్యాక్టరీ ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్ఫూర్తి ప్రాజెక్టు ద్వారా ఎండు చేపల ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 90శాతం రాయితీపై 5 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, సౌర విద్యుత్ ద్వారా రూపొందించిన ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసే ఎండు చేపలు ఎలాంటి రసాయనాలు, ఉప్పు లేకుండా పూర్తి స్థాయిలో ఆరోగ్యకరమైనవిగా ఉంటాయన్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసే చేపలు స్థానిక వినియోగానికి, విదేశాలకు ఎగుమతికి ఉపయోగపడుతాయని చెప్పారు. మారిటైమ్ బోర్డు పరిధిలోనే హార్బర్‌కు అనుసంధానంగా ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఫ్యాక్టరీతో పొదుపు సంఘాల్లోని 500 మంది మహిళలు జీవనోపాధి పొందుతారన్నారు. రెండుఎకరాల భూమి కేటాయించాలని అటవీశాఖాధికారులను ఆదేశించారు. నిజాంపట్నం హార్బర్ రెండో దశలో జరుగుతున్న పనులకు మరికొంత భూమి కేటాయించాలని ఇప్పటికే మారిటైమ్ బోర్డు ప్రతిపాదించిందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ పద్మ, మత్స్యశాఖ సహాయ సంచాలకులు కృష్ణకిషోర్, జిల్లా అటవీశాఖాధికారి భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించి పేరు తేవాలి

ఖోఖో క్రీడాకారులతో శాప్ చైర్మన్ రవినాయుడు

పంగులూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు కోరారు. పంగులూరు ఎస్ఆర్ఆర్ అకాడమీలో జరుగుతున్న రాష్ట్ర ఖోఖో జట్టు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం చైర్మన్ రవినాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఉత్తరాఖండ్‌లో ఈ నెల 28 నుంచి జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టు సత్తాచాటాలన్నారు. మంత్రి నారా లోకేశ్ ప్రాథమిక స్థాయి నుంచి క్రీడలపై దృష్టి సారించారని ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ గరటయ్య తెలిపారు. కార్యక్రమంలో ఖోఖో అసోషియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి, డీఎస్‌డీవో పాల్‌కుమార్, పాల్గొన్నారు.



ఏపీ ఖోఖో జట్టుతో శాప్ చైర్మన్ రవినాయుడు, అసోషియేషన్ చైర్మన్ గరటయ్య

రాష్ట్ర ఖోఖో క్రీడాజట్టు ప్రకటన

జాతీయ స్థాయి ఖోఖో పోటీలో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టులో పి.శివారెడ్డి, కె.రామ్మోహన్, ఎం.ఫణికుమార్, కె.వంశీ, ఆర్.సూరినాయుడు, షేక్ ఆలీనవాజ్(ప్రకాశం), పి.నరసయ్య, వి.భానుప్రసాద్(విజయనగరం), బి.కిరణ్(విశాఖ), కె.కొండలరావు(కృష్ణ), వి.పురుషోత్తం(అనంతపురం), ఎ.రాజ్‌కుమార్ (చిత్తూరు, కె.ప్రవీణ్(శ్రీకాకుళం), బి.లక్ష్మీనారాయణ (నెల్లూరు), జి.వెంకటేష్(విజయనగరం)ఉన్నారు. జట్టుకు కోచ్‌గా దేవిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి (ప్రకాశం), అసిస్టెంట్ కోచ్‌గా కొమరం అప్పారావు(విజయనగరం), మేనేజర్‌గా కాశీవిశ్వనాధరెడ్డి(ప్రకాశం) వ్యవహరిస్తారు.

హిమాలయ అగ్రీటెక్ కోసం వ్యవసాయ శాఖ వేట

● గుంటూరు రూరల్ మండలంలో విస్తృతంగా తనిఖీలు ● అనుమతి లేని బయో ఉత్పత్తులు కొనవద్దని రైతులకు సూచన

6

మొబైల్ బానిసత్వం!

● ప్రతి ఒక్కరినీ ముంచేస్తున్న స్మార్ట్ ఫోన్లు

● తగ్గించుకోకుంటే ప్రమాదమే అంటున్న నిపుణులు

8

దాడి ఘటనపై ఎస్పీతో చర్చించాం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది బేతాళ ప్రకాష్‌పై జరిగిన దాడి విషయం పై ఎస్పీ సతీష్ కుమార్‌తో చర్చించినట్లు ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మంగళవారం తెలిపారు. న్యాయవాదులకు ఇచ్చిన హామీపై ఎస్పీతో చర్చించినట్లు చెప్పారు. ఇరుపక్షాలపై నమోదైన కేసుల విషయమై డీఎస్పీ స్థాయి అధికారులతో విచారణకు ఆదేశించినట్లు, న్యాయవాది ప్రకాష్‌పై జరిగిన దాడి కేసులో తుళ్లూరు డీఎస్పీని ప్రత్యేక విచారణ అధికారిగా నియమించినట్లు ఎస్పీ తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన ఎస్ఐ రాజకుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేశారని విచారణ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు నరేంద్ర కుమార్ తెలిపారు. కాగా, గత కొన్నిరోజులుగా న్యాయవాదులు గుంటూరు ఫెడరేషన్, పొన్నూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఎమ్మెల్యేను కలిసిన న్యాయవాదులు ఈ దాడి గురించి ఆయనకు వివరించారు. సమస్య పరిష్కారం కోసం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీతో ఈ విషయమైన ఎమ్మెల్యే చర్చించారు.

జిందాల్ పవర్ ప్లాంటును సందర్శించిన మంత్రి గొట్టిపాటి



పవర్‌ప్లాంటు వివరాలను తెలుసుకుంటున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

యడ్లపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండవీడు రెవెన్యూ పరిధిలోని జిందాల్ వేస్ట్ ఎనర్జీ పవర్ ప్లాంటును విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం సందర్శించారు. వ్యర్థాల ద్వారా విద్యుత్‌ను ఎలా ఉత్పత్తి చేస్తున్నదీ, యంత్రాలు, ఉత్పత్తి తదితర వివరాలను జిందాల్ ప్రాజెక్టు ఎండీ ఎంవీ చారి మంత్రికి వివరించారు. వ్యర్థాలను గుంటూరు, విజయవాడ కార్పోరేషన్‌లతోపాటు, నరసరావుపేట, తెనాలి, చిలకలూరిపేట, పొన్నూరు, సత్తెనపల్లి మున్సిపాలిటీల నుంచి రోజుకు 1,200 టన్నుల వ్యర్థాలను సేకరించి విద్యుత్తు ఉత్పత్తికి వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 23 నుంచి గంటకు 20 మెగావాట్ల ఉత్పత్తికి పెంచేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి మిల్లు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ గుంటూరు ఈఈ శ్రీనివాసబాబు, ఏడీఈ రాజమోహనరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం మంగళవారం నాటికి 559.00 అడుగులు ఉంది. ఇది 230.06 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7353 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,837 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 49,370 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 27,861 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

యార్డులో రైతులు భోజనానికి ఇబ్బంది పడొద్దు

● విస్తృత తనిఖీలు నిర్వహించిన జేసీ ఆదేశాలు
● భోజనశాలల పరిశీలన
● రైతులతో మాట్లాడి సమస్యలపై అధ్యయనం



మిర్చియార్డులో పర్యటిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో జాయింట్ కలెక్టర్, పర్సన్ ఇన్‌ఛార్జ్ అమిలినేని భార్గవ తేజ ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ఆయన యార్డు ప్రాంగణానికి చేరుకున్న ఆయన, సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు, ఇతర అధికారులతో కలిసి తొలుత భోజనశాలలను పరిశీలించారు. ఈ నెల 23 నుంచి రైతులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం కానుండటంతో తొలుత వాటిలో కల్పించిన సౌకర్యాల గురించి ఆరా తీశారు. భోజనానికి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం తాగునీటి కుళాయిల్లో నీటి నాణ్యతను పరిశీలించారు. రైతులతో సంభాషించారు. యార్డులో సమ స్యల గురించి తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేశారు.

జీరో వ్యాపారం కాదన్న సెక్రటరీ

ఒక లారీలో మిర్చి టిక్కీల లోడింగ్‌కు సంబంధించిన పేపర్లను ఆయన పరిశీలించారు. వాటిల్లో వేమెన్ పత్రం లేకపోవడంపై జేసీ సీరియస్ అయ్యారు. సంబంధిత పర్యవేక్షణ సిబ్బంది ఎవరో గుర్తించి చర్యలు తీసుకోవాలని సెక్రెటరీని ఆదేశించారు. ఈ సందర్భంగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఎక్స్‌పోర్టర్ నాలుగైదు చోట్ల మిర్చిని కొనుగోలు చేస్తారని, ఒక్కో వేమెన్‌కి 10 నుంచి 15 దుకాణాల పర్యవేక్షణ ఉంటుందని, వేమెన్ ఒక్కో షాపులో కాటాలను పరిశీలించి చిట్టీలు ఇస్తుంటారని చెప్పారు. సరుకు ట్రేడింగ్ అయినట్లు లాట్ ఐడీలు ఉన్నాయని, జీరో వ్యాపారం కాదన్న సెక్రటరీ సమాధానంతో జేసీ సంతృప్తి చెందలేదు.

పెరిగిన మిర్చి దిగుమతి

మిర్చి సీజన్ సంక్రాంతి పండగ సెలవుల తర్వాత ప్రారంభం కావడంతో దిగుమతి బాగా పెరిగింది. దాదాపుగా ఇప్పటికే రెటింపు సంఖ్యలో మిర్చి టిక్కీలను రైతులను విక్రయానికి తీసుకొస్తున్నారు. సంక్రాంతి పండగ ముందు వరకు రోజుకు 50 వేల టిక్కీల లోపే వచ్చేవి. అలాంటిది ఒక్కసారి 90 వేలకు చేరాయి. ఈ సంఖ్య రాబోయే రోజుల్లో 2 లక్షలు దాటిపోతుందని యార్డు వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం యార్డులో మిర్చికి మంచి ధరనే లభిస్తుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం యార్డులో వేరే జిల్లాల నుంచి వచ్చిన రైతులను జేసీ వాకబు చేసిన సమయంలో ఒక రైతుకు తన మిర్చికి క్వింటాల్ రూ. 13,500, మరో రైతు రూ. 15,400 ధర లభించిందని తెలిపారు. మిరపకాయలు బాగా ఆరబెట్టి తీసుకొస్తే మంచి ధరనే వస్తుందని ఈ సందర్భంగా అధికారులు జేసీకి నివేదించారు.

రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు
● దావూస్ పర్యటన విజయవంతంపై హర్షం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల స్థాపన, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఎన్డీఏ ప్రభుత్వానికే సాధ్యమని, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలలకే నాలుగు కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఏ రాష్ట్రంలో లేని విధంగా వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు మార్గం సుగుణమైందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అనే సెంటుమెంట్‌కు వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచిందని, విశాఖ ఉక్కును తాకట్టుపెట్టారని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రూ.11,440 కోట్లు కేంద్ర నుంచి తెచ్చి విశాఖ ఉక్కు పరిశ్రమకు ఊరట కల్పించారన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో అమరావతి నిర్మాణంతోపాటు పోలవరానికి నిధులు తెచ్చా రని, అభివృద్ధికి ఇదే నిదర్శమని అన్నారు. చంద్రబాబునాయుడు, నారా లోకేశ్ దావూస్ పర్యటన విజయవంతమైందని 11.8 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఆంధ్రప్రదేశ్ లక్ష్మీ మిటల్ పరిశ్రమ ఏర్పాటుకు అంగీకారం కుదుర్చుకున్నారన్నారు. రాష్ట్రానికి రూ. 4 లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. గ్రీన్‌ఫీల్డ్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన మిటల్ కంపెనీకి ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్రానికి పెట్టుబడులకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని, త్వరలో వినుకొండలో ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులతోపాటు కొండపై రామలింగేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి మార్గం సుగమమైందని, పనుల నిర్మాణానికి ముఖ్యమంత్రి అనుమతులు ఇప్పటికే మంజూరైనట్లు చెప్పారు. పట్టణంలోని తాగునీటి పథకం నిర్మాణంతోపాటు ఎస్ఎస్‌పీ కాలనీలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆంజనేయులు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, పీవి సురేష్, గోవిందరాజులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు అభివృద్ధికి చంద్రబాబే కారకుడు

ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో విశాఖ ఉక్కు ఆర్థిక భరోసా లభించిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్రకే కాక యావత్ ఆంధ్ర రాష్ట్రానికి మణిహారంగా విశాఖ ఉక్కు కర్మాగారం వుందని, వేలాది మంది తెలుగువాళ్లు కలిసి వీరోచిత పోరాటాలు, త్యాగాల ఫలితంగా సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ పునర్జీవింపజేయడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం అన్నివిధాల సహకారం అందించడం సంతోషంగా వుందని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. ఆనాటి ముఖ్యమంత్రి జగన్ తనపై వున్న కేసుల నుంచి విముక్తి కల్పించుకునేందుకు ఆంధ్ర రాష్ట్రాన్ని తాకట్టు పెట్టడానికే ఢిల్లీ పర్యటనలు చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ఏపీకి కేంద్రం గుడ్‌న్యూస్ చెబుతోందని అన్నారు.

గౌడ్, గౌడ సామాజిక వర్గాలకు మద్యం దుకాణాల కేటాయింపు

● గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 26 షాపులు ● జీవో జారీ

గుంటూరు కార్పొరేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గౌడ్, గౌడ సామాజిక వర్గాలకు మద్యం దుకాణాల కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 13 విడుదల చేసింది. ఈ నేపథ్యంలో గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కే శ్రీనివాస రావు, గుంటూరు జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి అరుణకుమారి, పల్నాడు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి మణికంఠ తదితరులు ఆయా సామాజిక వర్గాల వారీగా జనాభా ప్రకా రం మద్యం షాపులను కేటాయించనున్నారు. గుంటూరు జిల్లాలో 13 షాపులు, పల్నాడు జిల్లాలో 13 షాపులు చొప్పున మొత్తం 26 షాపులను ఆ రెండు సామాజిక వర్గాలకు కేటాయించారు. గుంటూరు జిల్లాలో గౌడ్ సామాజిక వర్గానికి 4 షాపులు, గౌడ సామాజిక వర్గానికి 9 షాపులు చొప్పున మొత్తం 13 షాపులు కేటాయించారు. అదేవిధంగా, పల్నాడు జిల్లాలో కూడా గౌడ్ సామాజిక వర్గానికి 4 షాపులు, గౌడ సామాజిక వర్గానికి 9 షాపులు చొప్పున మొత్తం 13 షాపులు కేటాయించారు. త్వరలో టెండర్లు నిర్వహించి, షాపులు కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు.



నిందితుల వివరాలను తెలుపుతున్న సీఐ రమేష్ బాబు తదితరులు

గంజాయి విక్రేతల అరెస్టు



నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

తెనాలి, మారీసుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసలై ముఠాగా ఏర్పడి గంజాయిని విక్రయిస్తున్న నిందితులను అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు చెప్పారు. సీఐ స్వాధీ నం చేసుకున్న గంజాయితో పాటు నిందితులను చూపుతూ స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. తెనాలికి చెందిన ఏడుగురు యువకులు వేముల సాయిమణికంఠ, ముత్యాల విజయ్, తమ్మిశెట్టి మదన్‌కుమార్, దనావత్ పార్థు, మూర్తి శివకుమార్, కుందాల హనుమంత రావు, ప్రేమ్‌లు చెడువ్యసనాలకు బానిసలై స్నేహితులయ్యారు. వీరు జల్సా చేసేందుకు సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో గంజాయి విక్రయాలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అరకులో గుర్తుతెలియని వ్యక్తి నుంచి 1.6 కేజీల గంజాయిని రూ.32 వేలకు కొనుగోలు చేసి వాటిని తెనాలికి తీసుకువచ్చి చిన్న, చిన్న ప్యాకెట్‌లుగా తయారుచేస్తున్నారు. వాటిని పెడదారిపట్టిన యువతకు, కళాశాలల విద్యార్థులకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో అందరు కలిసి జల్సా చేస్తుంటారు. ఇదే క్రమంలో మంగళవారం మధ్యాహ్నం స్థానిక సుల్తానాబాదులోని సెయింట్ ఆన్ స్కూల్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడి చేయగా ఏడుగురు వ్యక్తుల్లో ఇద్దరు పారిపోగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 1.1 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారుగా రూ. 22 వేలు ఉంటుందన్నారు. పరారీలో ఉన్న కుందాల హనుమంతరావు, ప్రేమ్‌ల కోసం గాలింపుచర్యలు చేపట్టామని త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేయనున్నట్లు వివరించారు. పట్టణ ప్రజలు తమ ప్రాంతంలో నిషేధిత మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు సమాచారం తెలిస్తే 100కి లేదా 112కి గాని దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారమివ్వాలని కోరారు.

ఉత్కంఠగా ఎడ్ల బండలాగుడు పోటీలు

● పల్నాడు జిల్లా ఎడ్ల జతకు ప్రథమ స్థానం



దుర్గి,జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు ఉత్కంఠగా జరుగుతున్నాయి. మంగళవారం నాలుగుపళ్ల విభాగం పోటీలో పల్నాడు జిల్లా దాచే పల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 4915 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానంలో నిలి చింది. బాపట్ల జిల్లా ఎద్దలపూడి మండలం అనంతవరంకు చెందిన పెదవల్లి బ్రదర్స్ ఎడ్ల జత 4750 అడుగులతో రెండో స్థానం, బాపట్ల జిల్లా జెపంగులూరుకు చెందిన చీకూరి నాగేశ్వరరావు ఎడ్లజత 4678 అడుగులతో మూడో స్థానం, గుంటూరుజిల్లా ఫిరంగిపురం మండలం కండ్రికకు చెందిన కేశం పద్మానాయుడు ఎడ్లజత 4543 అడుగులతో నాలుగోస్థానం, తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్ జిల్లా పెదకొత్తపల్లికి చెందిన శివ ఎడ్లజత 4286 అడుగులతో ఐదో స్థానంలో నిలిచాయి. ఈ పోటీలకు రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, బండ్ల ప్రసాద్‌లు వ్యవహరించారు. కటకం రామారావు, గండె గోపాలరావు పర్య వేక్షణలో జరిగిన ఈ పోటీల్లో కూనిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యేచూరి సునీత శంకర్, తోటకూర శ్రీనివాసరావు, పులి హరి, వంక మళ్ల కోటేశ్వరరావు, శ్రీరాం కాశీబాబు, నాగెండ్ల శ్రీను, ఆకుల లక్ష్మణ, సూరె వెంకటేశ్వర్లు, దేవరకొండ కుశాలయ్య, మల్లె వెంకటేశ్వర్లు, కొండా లచ్చయ్య, మునగాకుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విజేతలకు కప్ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

'భాష్యం' ప్రీమియర్ లీగ్ క్రికెట్

గుంటూరు (విద్య)జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జయాపజయాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకున్నపుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో భాష్యం రామసేతు క్యాంపస్ సమీపంలోని జేఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ - బీపీఎల్ 2024-25లో భాగంగా రెండో రోజు మంగళవారం జరిగిన ప్రిలిమినరీ మ్యాచ్‌లు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉదయం ప్రిలిమినరీ మ్యాచ్‌లో హైదరాబాద్ హాక్స్ జట్టు - 3తో, గుంటూరు జెయింట్స్-3 తలపడగా గుంటూరు జెయింట్స్-3 జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం కృష్ణా నైట్స్ జట్టుతో వైజాగ్ వెలాసిటీ-3 జట్టు తలపడగా వైజాగ్ వెలాసిటీ-3 జట్టు విజయం సాధించింది. పోటీల్లో గెలుపొందిన జట్టుకు చైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

హిమాలయ అగ్రీటెక్ కోసం వ్యవసాయ శాఖ వేట

● గుంటూరు రూరల్ మండలంలో విస్తృతంగా తనిఖీలు
● అనుమతి లేని బయో ఉత్పత్తులు కొనవద్దని రైతులకు సూచన



యనమదలలోని పురుగుమందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు , ఏఓ సుబ్రహ్మణ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏవిధమైన అనుమతి లేకుండా బయో ఉత్పత్తులు విక్రయిస్తున్న హిమాలయ అగ్రిటెక్ కోసం వ్యవసాయ శాఖ వేట ప్రారంభించింది. మంగళవారం గుంటూరు రూరల్ మండలంలోని యనమదల, ఓబుల్ నాయుడు పాలెం, చౌడవరం, పొత్తూరు తది తర గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు ,ఏఓ సుబ్ర హ్మణ్యం తనిఖీలు నిర్వహించారు.ఈ నెల 17న 'ఆగని ఆగడాలు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించి ఈ ప్రత్యేక తనిఖీ లు చేప ట్టారు. గ్రామాల్లోని రైతులతో సమావేశం ఏర్పాటు చేసి గుర్తుతెలియని వ్యక్తులు విక్రయించే బయో ఉత్పత్తులు కొనుగోలు చేయవద్దని సూచించారు. 'హిమాలయ అగ్రిటెక్' పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు విక్రయించే అనుమతి లేని బయో ఉత్పత్తులు కొనుగోలు చేసి మోస పోవద్దని విజ్ఞప్తి చేశారు. జీ-2 అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు బయో ఉత్ప త్తుల పేరుతో రైతులకు నకిలీ మందులు విక్రయిస్తున్నట్లు వచ్చిన వార్తల నేప థ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. అటువంటి వ్యక్తులు తారసపడితే వెంటనే వ్యవసాయ శాఖ కు సమాచారం అందించాలని సూచిం చారు. ఈ సందర్భంగా యనమదలలోని పురుగుమందుల దుకాణాలను ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు తనిఖీ చేశారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

విజ్ఞాన్ వర్సిటీ, బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ అవగాహన ఒప్పందం

గుంటూరు (విద్య)జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, బెంగళూరులోని బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని మంగళవారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెంగళూరులోని బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్అండ్‌డీ వైస్ ప్రెసిడెంట్ మురళీక్రిష్ణ మీనన్, బిజినెస్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ స్ట్రాటజిక్ సర్వీసెస్ హెడ్ మనోగరన్‌లతో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్, ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చని అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, సెమినార్లు, ఇండస్ట్రీ, అకాడెమియా ఇంటరాక్షన్స్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పరీక్షలు

విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ రావు తెలిపారు. పీజీ లో ఆర్ట్స్, సైన్స్, ఎంబీఏ, ఎంఈడి కోర్సులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్ లుగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

యూనివర్సిటీ బస్సు సమయాల్లో మార్పులు

పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ)పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఉద్యోగులను, అధ్యాపకులను వర్సి టీకి తీసుకువచ్చే బస్సుల సమయంలో మార్పులు చేసినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే. సుబ్బారావు తెలిపారు. బస్సు సమయాలను బుధవారం నుంచి 31వ తేదీ వరకు మార్పులు చేసినట్లు తెలిపారు.

డాక్టర్ వసంతకు జాతీయ ప్రతిభా పురస్కారం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని యూనివర్సిటీ కాలేజీఆఫ్ సైన్స్ కు సంబంధించిన డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ , ఇంజ నీరింగ్ విభాగంలో బోధనా సిబ్బందిగా పని చేస్తున్న డాక్టర్ రుద్రమల్ల వసంత కు సావిత్రిబాయి పూలే జాతీయ పురస్కారం వచ్చింది. ఆమె చేసిన పరిశోధనల కృషికి గాను ఈ అవార్డు లభించింది. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో వసంతకు ఈ పురస్కారాన్ని అందజేశారు . డాక్టర్ వసంతకు ఈ గుర్తింపు రావడం కంప్యూటర్ అండ్ ఇంజనీరింగ్ రంగంలో విద్యార్థుల సాధికారత, అక డమిక్ ఎక్సలెన్స్ ప్రోత్సహించ డంలో ఆమె అంకితభావాన్ని గుర్తు చేస్తుందని వైస్ చాన్స్ లర్ ఆచార్య కే గంగాధరరావు అన్నారు. అవార్డు గ్రహీత వసంత మాటాడుతూ ఈ గుర్తింపు విద్యార్థుల అభివృద్ధికి , విద్యా సంఘం అభివృద్ధికి మరింత దోహదపడేలా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ గౌరవాన్ని తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, గురువులకు, సహచరులకు, విద్యార్థులకు, వర్సిటీ కుటుంబానికి అంకితం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వసంతను డాక్టర్. బీ బసవేశ్వరరావు, డాక్టర్ కే .లావణ్య, డాక్టర్ జీ నీలిమ , డాక్టర్ సూర్య కామేశ్వరి, ఎం.పుష్పలత, సిబ్బంది అభినందిం చారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145.154.165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

84,985 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 87,334 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 84,985 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 56,872 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7200	14500	334	8000	13000
నెంబరు. 5	9500	13000	నెంబరు.5	7500	7500
273	11500	11500	273	--	--
341	8000	15000	341	8500	10500
4884	9500	13500	4884	--	--
సూపర్ 10	8000	10500	సూపర్ 10	8500	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7000	15500	తేజ	7500	15000
బ్యాడిగి	7300	12500	బ్యాడిగి	7500	11500
దేవనూరు డీలక్స్	7500	14300	దేవనూరు డీలక్స్	10000	12500
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	8500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నేడు రసాయన ఎరువుల విక్రయ కేంద్రం ప్రారంభం

వేమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతుల సౌకర్యార్థం వేమూరు మార్కెట్ యార్డు ఆవరణలో జీడీసీఎంఎస్ ఆధ్వర్యంలో రసాయన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భూసేకరణ వేగంగా పూర్తి చేయాలి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

బాపట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారుల భూసేకరణ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్‌లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి జాతీయ రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణపై మంగళవారం కలెక్టర్‌లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 20 జిల్లాలలో 87 జాతీయ రహదార్లు ప్రభుత్వం మంజూరు చేయటం జరిగిందన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ చేయటానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వెంకట మురళీ, జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో గంగాధర్ గౌడ్

జాతీయ రహదారి నిర్మాణాల భూసేకరణకు నిధుల కొరత లేదని ఆయన చెప్పారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ బాపట్లజిల్లాలో రెండు జాతీయ రహదారులు మంజూరయ్యాయని తెలిపారు. పిడుగురాళ్ళ 167ఎ జాతీయ రహదారి, బెంగుళూరు-విజయవాడ జాతీయ రహదారి 544జి పనులకు భూసేకరణ చేపట్టటం జరిగిందన్నారు. రెండు జాతీయ రహదారులకు సంబంధించి మిగిలిన 3.5 కిలోమీటర్ల రహదారులకు భూసేకరణ అవార్డు పాస్ చేయటం జరిగిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణాల కోసం అవార్డు పాస్ చేసిన భూములకు సంబంధించి నష్టపరిహారం 10 రోజులలో రైతులకు చెల్లించటం జరుగుతుందని తెలిపారు. బాపట్ల నుంచి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వారిలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

23న ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుతో ఆత్మీయ సమావేశం

రేపల్లె, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : పీడీఎఫ్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ్‌రావుతో ఈనెల 23వ తేదీ సాయంత్రం యూటీఎఫ్ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం జరగనున్నదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కేఎస్ లక్ష్మణరావుతో ప్రజాసంఘ నేతలు, ఉద్యోగులు, యువత, కార్మిక ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేయటం జరిగిందని, ఈ సమావేశానికి అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

రేపల్లె, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల బకాయిలు కూటమి ప్రభుత్వం పరిశీలించి వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ తేలప్రోలు శ్రీనివాసరావు అన్నారు. రెండు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసిన ఉపాధ్యాయుల, ఉద్యోగుల సరండర్ బిల్లులు నేటికి మంజూరుకాకపోవటం శోచనీయమన్నారు. అలాగే జిల్లా పరిషత్‌కు దరఖాస్తు చేసిన టీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు నగదు ఉపాధ్యాయుల, ఉద్యోగుల అకౌంట్‌లో జమకాలేదన్నారు. పీఆర్సీ బకాయిని వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఖాతాలో ప్రభుత్వం జమ చేయాలని ఆయన కోరారు.

23న విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు

చెరుకుపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : కన్స్యూమర్ గ్రావెన్సెస్ రిడ్రెస్సెల్ (సీజీఆర్ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు ఈనెల 23న చెరుకుపల్లి కస్తూరివారిపేటలో గల శ్రీరామశాస్త్రి కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు బాపట్ల ఈఈ గువ్వల ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేలు, ఫోరం సభ్యులు, బాపట్ల ఎస్ఈ, విద్యుత్ అధికారులు పాల్గొంటారని చెప్పారు. బాపట్ల డివిజన్‌లోని బాపట్ల, పొన్నూరు, చెరుకుపల్లి సబ్ డివిజన్‌ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబర్, పూర్తి చిరునామ, మొబైల్ నెంబర్‌తో అర్జీ ఇచ్చి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటర్, బిల్లుల సమస్యలు విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తారన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రజలంతా సహకరించాలి : సర్పంచ్

నాగరాజుపాలెం (కర్లపాలెం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ప్రజలందరూ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని నాగరాజుపాలెం గ్రామ సర్పంచ్ మస్తాన్‌బి అన్నారు. మండలంలోని నాగరాజుపాలెం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ మస్తాన్‌బి అధ్యక్షతన కార్యదర్శి తిరుపాల్‌రెడ్డి గ్రామసభ నిర్వహించారు. ప్రజలందరూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, కీలక భూమిక పోషించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. గ్రామంలో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో పలు కీలక అంశాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బాపట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి అరుణాచలేశ్వర ఆర్గనైజేషన్ వారు ఆర్థికసాయం అందజేశారు. పట్టణంలోని నరాలశెట్టివారిపాలెనికి చెందిన ట్యాక్సీ డ్రైవర్ షేక్ వలి కుటుంబానికి క్రైమ్ డీఎస్పీ జగదీష్ నాయక్ చేతుల మీదగా ఆర్థికసాయం అందించారు. ఆర్థికసాయం సమకూర్చిన ఆర్గనైజేషన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో చందనం మధుబాబు, చందనం రాజేష్, కొండపాటూరి అనీల్‌కుమార్, షేక్ షౌకత్ అలి, వైఎస్ రావు తదితరులు ఉన్నారు.

గానాల రామమూర్తికి ఘన నివాళి

బాపట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణులను బీసీలలో చేర్చి వారికి రిజర్వేషన్ కల్పించే విధంగా మద్రాస్ రాష్ట్రంలో ఎమ్మెల్సీగా పనిచేస్తూ పోరాటం చేసిన పండిత రావుబహుదూర్ బ్రహ్మశ్రీ గానాల రామమూర్తి చిరస్మరణీయులని బాపట్ల విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు అన్నారు. రామమూర్తి జయంతి కార్యక్రమం మంగళవారం పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెదురుపర్తి లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కడలి జగదీష్, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షుడు గొర్రెపాటి ప్రభాకర్, జిల్లా కోశాధికారి మచ్చా సుధాకర్, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ఎం.అనీల్‌కుమార్ పాల్గొన్నారు

పేరలిలో లెప్రసీ సర్వే

పేరలి (కర్లపాలెం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరలి గ్రామంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు మంగళవారం ఇంటింటికి తిరిగి లెప్రసీ సర్వేను నిర్వహిస్తుండగా ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను చేస్తున్న కూలీలతో ముచ్చటించారు. కూలీల నుంచి పలు విషయాలు తెలుసుకున్నారు. పనులు సక్రమంగా చేయాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ శివన్నారాయణతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక పెండింగ్

● వయసు కనీసం 45 ఏళ్లు ఉండాలనే నిబంధన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు బీజేపీ నూతనంగా అధ్యక్షులను మంగళవారం నియమించింది. రెండు జిల్లాలను మాత్రమే పెండింగ్‌లో ఉంచగా అందులో ఒకటి బాపట్ల జిల్లా ఉంది. వయసు నిబంధన వంటి ఆసక్తికరమైన అంశంతో అధ్యక్షుడి ఎంపికను బీజేపీ వాయిదా వేసింది. ప్రస్తుతం బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న యార్లగడ్డ లక్ష్మీనారాయణ వయసు 40 ఏళ్లు కాగా పార్టీ నిబంధనల ప్రకారం జిల్లా సారథి వయసు కనీసం 45గా ఉండాలని ఉంది. దీంతో ఈ నిబంధన కొత్తగా ఎంపికయ్యే వాళ్లకు మాత్రమే వర్తిస్తుందా లేక ఇప్పటికే జిల్లా అధ్యక్ష పదవిలో ఉన్నవారికి కూడా అదే వయసు ప్రామాణికమా అనే అంశంపై స్పష్టత కోసం పార్టీ అధిష్ఠానానికి నివేదించారు. మరో రెండు, మూడు రోజుల్లో ఈ విషయంపై అధిష్ఠానం నిర్దేశనం చేస్తుందని, తర్వాత బీజేపీ జిల్లా అధ్యక్షుడి నియామకం చేపడతామని పార్టీ వర్గాలు తెలిపాయి

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి : కమిషనర్



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పన్ను వసూళ్ళు వేగవంతం చేయాలని సచివాలయ కార్యదర్శులను కమిషనర్ జి.రఘునాధరెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం యాదవపాలెం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆస్థి పన్ను, నీటికుళాయి చార్జీలు, ఖాళీ స్థలాల పన్నులు వసూళ్ళను వేగవంతం చేయాలన్నారు. పన్ను వసూళ్ళలో పురోగతి లేకుంటే సహించేదిలేదన్నారు. అనంతరం 11వ వార్డు ఇందిరానగర్ కాలనీలో పర్యటించి అక్కడ ప్రజలు తాగునీటి సరఫరాలో పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. నేషనల్ హైవే వారు కొత్త పైపులైన్ అమర్చినందున ఇంటర్ కనెక్షన్ లేక నీరు అందటంలేదని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి నీటిని అందించాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, ఇన్‌స్పెక్టర్ షేక్ ఇమామ్, శివరామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల రంగస్థల నటుడికి జాతీయ పురస్కారం



పురస్కారంతో రంగస్థల నటుడు సంగానీ ఏడుకొండలు

బాపట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్లకు చెందిన రంగస్థల నటుడు సంగానీ ఏడుకొండలకు జాతీయ రంగస్థల పురస్కారం లభించింది. తెలుగు సంస్కృతి, సాహిత్య సేవా ట్రస్ట్, ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు జాతీయ స్థాయి మొదటి వార్షికోత్సవం సందర్భంగా విజయవాడ విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించిన పోటీలలో బాలచంద్రుడు ఏకపాత్రను బాపట్ల మండలం ఆదర్శనగర్‌కు చెందిన సంగానీ ఏడుకొండలు ప్రదర్శించారు. మూడున్నర దశాబ్దాలుగా పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తూ ప్రతిభ కనబరిచినందుకు స్వర్ణ కంకణంతో, పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన రవిశంకర్, గుర్రం జయరాం, డాక్టర్ గౌరిశంకర్ తదితరులు పాల్గొని ఏడుకొండలకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా బాపట్లకు చెందిన పలువురు ఆయనను అభినందించారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి : జేసీ

బాపట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను పూర్తి స్థాయిలో నివారించాలని జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023లో జిల్లాలో 567, 2024లో 522 ప్రమాదాలు జరిగాయన్నారు. ఈ సంఖ్యను జీరోకు తీసుకొచ్చేవిధంగా అందరూ కృషిచేయాలన్నారు. బ్లాక్ స్పాట్లలో వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు సహాయపడే గుడ్ సమరితన్‌లకు రూ.5 వేల ఆర్థికసాయంపై ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్, జిల్లా రవాణాశాఖాధికారి టీకే పరంధామరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో బాపట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ

బాపట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : భారత వాతావరణ శాఖ 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన ఒలింపియాడ్‌లో బాపట్ల పబ్లిక్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని డి.నిహారిక రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో వాతావరణ శాఖ డైరెక్టర్ మృత్యుంజయ మహాపాత్ర చేతుల మీదగా జ్ఞాపికను అందజేశారు. బాపట్ల పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నిహారికను మెమోంటోతో వాతావరణ శాఖకు సంబంధించిన శాస్త్రవేత్తలు జె.షడ్రక్, ఎం.రమేష్ బాబు, బి.ప్రసాద్, జి.గుప్తేష్, ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరఘురాం అభినందించారు.

స్వామి వివేకానందకు జన్మతిథి పూజలు



స్వామి వివేకానంద చిత్రపటాన్ని పూలతో అలంకరిస్తున్న విద్యార్థినులు

కర్లపాలెం; జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని శ్రీరామకృష్ణ సేవాసమితిలో శ్రీ స్వామివివేకానంద జన్మతిథి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ స్వామి వివేకానంద చిత్రపటాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అష్టోత్తర శతనామావలి పూజను హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు ఘనంగా జరిపారు. శ్రీ స్వామివారి వివేకానందవారితో పాటు శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీశారదా మాతలను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామకృష్ణ సేవాసమితికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలను తిమ్మరాజు వెంకటసుబ్బారావు, చందు పిచ్చయ్య, సతీష్‌మహరాజు భక్తోపన్యాసం చేసి స్వామివివేకానంద జీవిత చరిత్ర గురించి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాటూరి వెంకటేశ్వరరావు, కాకర్లపూడి రమణరాజు, బుర్ల బుల్లియ్య, జిడుగు వెంకటేశ్వర్లు, కాటూరి బాజి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అజయ్ మిశ్రాను సత్కరించిన మాజీ సైనిక సంక్షేమ సంఘ నాయకులు

బాపట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా గుంటూరు విచ్చేసిన ఉమ్మడి రాష్ట్ర జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అజయ్‌మిశ్రాను మంగళవారం బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, ఉమ్మడి జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు సుంకర శేషగిరిరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

అల్లూరు (పిట్టలవానిపాలెం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలలో నగదును దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎం.వి.ఎస్.వర్మ ఆధ్వర్యంలో భవనవారిపాలెం మహిళా భక్తసమాజం, దేవస్థానం సిబ్బందితో లెక్కించారు. ఏడు నెలలకు సంబంధించి రూ.2 లక్షల 44 వేల 621 ఆదాయం వచ్చినట్లు వర్మ తెలిపారు.

అధిక ధరలకు మద్యం విక్రయించరాదు

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు

నగరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ రేట్ల కంటే అధిక ధరలకు విక్రయించరాదని బాపట్ల జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు విడతల చలానా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నాటుసారా తయారు చేస్తే ఉపేక్షించేదిలేదని, వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే



మండూరులో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మండూరు (చుండూరు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : భూ సంబంధిత సమస్యలు, భూ రికార్డులలో అవకతవకలకు సరైన రీతిలో నమోదు కాకపోవడం వంటి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి ప్రభుత్వం సమగ్రంగా పంట భూముల రీ సర్వే కార్యక్రమం చేపట్టిందని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. మండూరులో జరుగుతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. భూ వివాదాలు, ఇతర భూ సంబంధిత సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. డీటీ శ్రీనివాసరావు, సర్వేయర్ ఖాసీం, ఆర్ఐ ప్రభు, వీఆర్వో రత్నప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

● కోమలి (పిట్టలవానిపాలెం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమలి గ్రామంలో రైతులకు సంబంధించిన పంట పొలాలను పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ ఆదేశాల మేరకు రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భూములకు సంబంధించిన రైతులు సమగ్ర సమాచారంతో తమ భూములను వద్ద ఉండి సర్వే బృందాలకు తెలియజేయాలని తహసీల్దార్ తెలిపారు.

మద్యం మత్తులో జరిగిన వివాదంతో వ్యక్తి మృతి

వేమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వేమూరులో గురువారం రాత్రి మద్యం మత్తులో జరిగిన వివాద సంఘటనలో గాయాలపాలై గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పోతార్లంక సుబ్రహ్మణ్యం (బుల్లోడు) సోమవారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం రాత్రి జరిగిన సంఘటనలో సుబ్రహ్మణ్యంను అద్దేపల్లి జాన్‌వెస్లీ, అతని సోదరుడు ప్రవచన్, బూనిగడ్డ డేవిడ్ గాయపరిచారు. గాయాల పాలైన సుబ్రహ్మణ్యం రెండు రోజులుగా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు ధ్రువీకరించారు. సుబ్రహ్మణ్యం భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని సోమవారం కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

పశు వైద్య శిబిరాలను రైతులు ఉపయోగించుకోవాలి

● జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ షనీలాకుమారి

నల్లమోతువారిపాలెం (కర్లపాలెం) జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ షనీలాకుమారి, జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ వేణుగోపాల్ సంయుక్తంగా అన్నారు. మండలంలోని నల్లమోతువారిపాలెంలో జరుగుతున్న ఉచిత పశు వైద్య శిబిరాన్ని మంగళవారం వారు సందర్శించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ రేచల్ దివ్య తమ సిబ్బందితో దూడలకు, సన్నజీవాలకు నట్టల నివారణ మందులు వేయించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి చిన్న, మాడా శ్రీనివాసరావు, గరిగంటి శ్రీనివాసరావు, ఆట్ల బాలశంకర్‌రెడ్డి, సహాయ సంచాలకులు డాక్టర్ శంకరరావు పాల్గొన్నారు.

● మోళ్ళగుంట(రేపల్లె), జనవరి 21(ఆంధ్రజ్యోతి) : పాడిరైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని పశుసంవర్ధకశాఖ సహాయసంచాలకులు డాక్టర్ బెల్లంకొండ నాంచారయ్య అన్నారు. మండలంలోని మోళ్ళగుంట, చెన్నుపల్లివారిపాలెం గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు నట్టలనివారణమందులు, తిరిగి కట్టిన పశువులకు పరీక్షలు నిర్వహించి వాటికి అవసరమైన మందులను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బర్లంక పశువైద్యాధికారి పి.మీనాక్షిదేవి, టీడీపీ నాయకులు ఎస్.వరప్రసాద్, ఎన్.నవీన్, జీ.లక్ష్మణ్‌రావు, గ్రామసర్పంచ్ ముత్తిరెడ్డి జయరామయ్య, లైవ్‌స్టాప్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, జీఎం జయవర్ధన్, రత్నం, బాబూరావు, పశుసంవర్ధకశాఖ సహాయకులు కుమారి, స్వాతి, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● వేమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పశు వైద్య శాఖ ఆదేశాల మేరకు సోమవారం ప్రారంభించిన గ్రామ గ్రామాన పశు వైద్య శిబిరాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నియోజకవర్గంలోని ఏడు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశు వైద్య శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ జనార్ధనరావు పర్యవేక్షణలో అమృతలూరు, క్రాప, ఈపూరులంక, పెరవలి, చినపరిమి, యడ్లపల్లి, భట్టిప్రోలు గ్రామాలలో శిబిరాల నిర్వహణ జరిగింది. 236 మంది రైతులకు సంబంధించిన 257 పశువులకు వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. 1473 గొర్రెలు, గేదెలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. 257 గొర్రెలకు టీకాలు వేశారు. పశు వైద్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● అమృతలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పశు వైద్య శిబిరాలను సద్వినియోగపరుచుకోవాలని వైద్యాధికారి మౌనిక అన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 31వ తేదీ వరకు పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అమృతలూరులో నిర్వహించిన వైద్య శిబిరంలో 141 పశువులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు గణపతినాయక్, బి.బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు క్రొత్తపల్లి రవీంద్రబాబు, సిబ్బంది బెన్నీ, విజయ్, రవీంద్ర, సింధు తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో కూటమి ప్రభుత్వం పశుపోషకులకు అందజేసే పశు ఆరోగ్య వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అప్జల్ తెలిపారు. మండలంలోని చందోలు గ్రామపంచాయతీ పరిధిలోని-12 సచివాలయాలలో, పిట్టలవానిపాలెం మండల వైద్యాధికారి ఎం.కిరణ్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పిట్టలవానిపాలెం వైద్యాధికారి ఎం.కిరణ్ మాట్లాడుతూ వైద్య కేంద్రం పరిధిలోని లేగదూడలకు, గేదెలకు నట్టల నివారణ మందులు, గొర్రెలకు, కోళ్ళకు టీకాలు అందించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందోలు గ్రామ సర్పంచ్ గౌరిదేవి విజయకుమారి, మునీర్, చందోలు-2 నీటి సంఘం అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, బి.రవికుమార్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, భట్టిప్రోలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంగళవారం అందజేశారు. మండల కేంద్రం కొల్లూరుకు చెందిన ఎన్.తిరుపతమ్మ, ఎన్.కృష్ణవేణి, భట్టిప్రోలు మండల పరిధిలోని పెదపులివర్రు గ్రామానికి చెందిన ఎన్.వెంకటరామయ్య, ఎన్.కేశవరావులు అనారోగ్య కారణాలతో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందారు. తమ ఆర్థిక పరిస్థితి గురించి ఎమ్మెల్యే ఆనందబాబుకు వివరించడంతో స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు. సిఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి వచ్చిన వెంకటరామయ్యకు రూ.35,350, కేశవరావుకు రూ.20,524, తిరుపతమ్మకు రూ.45,350, కృష్ణవేణికి రూ.30,786 చెక్కులను ఆయా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యేలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు అండగా నిలుస్తున్న సీఎం చంద్రబాబు



బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అండగా నిలిచి వారికి ఆర్థికసాయాన్ని అందిస్తున్నారని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలకు అండగా నిలవటమే లక్ష్యంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషి చేస్తున్నారన్నారు. రూ.8.50 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, రేపల్లె టీడీపీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా చేయడం లేదు

● తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన టీడీపీ నేత మురళీకృష్ణ



రేషన్ పంపిణీపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మురళీకృష్ణ

కొల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రేషన్ పంపిణీ సక్రమంగా పంపిణీ చేయకపోగా లబ్ధిదారులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ వాహనదారుల అక్రమాలు, ఆగడాలపై మంగళవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు దృష్టికి మైనేని తీసుకు వచ్చారు. వాహనదారులు బియ్యం, పంచదార, కందిపప్పులను లబ్ధిదారులకు సక్రమంగా ఇవ్వడం లేదని, ముఖ్యంగా కందిపప్పును ఇవ్వకపోగా అడిగిన లబ్దిదారులపై తమ ఇష్టం వచ్చిన వారికి ఇస్తామని మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పైగా ఈ గ్రామానికి చెందిన ఓ మహిళ మరో చోట ప్రభుత్వ పాఠశాలలో వంట మనిషిగా పని చేస్తుందని, ఆమెకు 30 కిలోల కందిపప్పును ఓ రేషన్ వాహనదారుడు ఇచ్చినట్లుగా లబ్దిదారులు తన దృష్టికి తెచ్చారని తహసీల్దార్‌కు వివరించారు. క్రాప గ్రామంలో ఒక్క లబ్ధిదారునికి కూడా కందిపప్పును పంపిణీ చేయలేదని చెప్పారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే ఫోన్‌లో సీఎస్‌డీటీకి వాహనదారులు చేస్తున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని, గురువారం వాహనదారులతో సమావేశం నిర్వహించి రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీడీపీ నాయకులు వేములపల్లి మోహనకృష్ణ, నూకల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారిపై విచారణ

కొల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వైద్యాధికారిపై వచ్చిన ఆరోపణల గురించి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందం మంగళవారం విచారణ నిర్వహించింది. కొల్లూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యులు డి.రవిబాబు సిబ్బంది పట్ల అనుచితంగా ప్రవర్తించారని వచ్చిన ఆరోపణలపై విచారణాధికారి, డీఐవో శ్రావణ్‌బాబు పలువురిని విచారించారు. సిబ్బంది పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికంగా ఉన్న టీడీపీ నేత మైనేని మురళీకృష్ణను సిబ్బంది ఆశ్రయించడంతో ఆయన వారి పక్షాన నిలిచి వైద్యునిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విచారణలో భాగంగా మురళీకృష్ణను కూడా విచారించి ఆయన నుంచి లిఖిత పూర్వక పత్రాన్ని తీసుకున్నారు. నివేదికను వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు. విచారణలో ఆర్ఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

దేశభక్తి కలిగి ఉండాలి

అద్దేపల్లి (భట్టిప్రోలు), (కొల్లూరు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : దైవభక్తితో పాటు దేశభక్తి కలిగి ఉండాలని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. భట్టిప్రోలు అద్దేపల్లిలోని అమ్మవారి చెట్టు వద్ద భరతమాత చిత్రపటానికి మంగళవారం పూజలు నిర్వహించారు. పది రోజుల పాటు భరతమాతకు పూజలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, రేపల్లె ఖండ్ ధర్మప్రచారక్ మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, శివయ్య, వీరాంజనేయులు, సారధి, మహిళలు పాల్గొన్నారు.

రోగులకు వైద్య సేవలు

అమృతలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తురుమెళ్లలో హెల్ప్ హాస్పటల్, గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మంది రోగులకు ఈసీజీ, ఎకో వైద్య పరీక్షలు జరిపారు. 15 మందికి అదనపు పరీక్షల నిమిత్తం ఎంజోగ్రామ్ పరీక్ష నిమిత్తం విజయవాడ హెల్ప్ హాస్పటల్‌కు సిఫార్సు చేశారు. వైద్యనిపుణులు జ్వాలసాయి రోగులను పరిశీలించారు. తొలుత వైద్య శిబిరాన్ని టీడీపీ నాయకులు యలవర్తి బ్రహ్మానందం, క్రొత్తపల్లి రవీంద్రబాబులు ప్రారంభించారు. కొసరాజు దేవకుమార్ పర్యవేక్షణలో బేతాళ కిరణ్ ఆళ్ళ అంకమ్మరావు, ఆళ్ళ వెంకటేష్‌లు సేవలందించారు.


● మా పాపకు ఫోన్ అలవాటైపోయింది. ఫోన్ తీసుకుంటే ఏడుస్తోంది. గంటల తరబడి ఫోన్లో బొమ్మలు చూస్తూ గడిపేస్తోంది. ప్రవర్తనలో కూడా మార్పు కనిపిస్తోంది. పిలిచినా పలకడం లేదు. పట్టించుకోవడం లేదు. ఆడుకోవడానికి వెళ్లడం లేదు. పెద్దవాళ్లు ఎత్తుకుంటున్నా దగ్గరకి రావడం లేదు. ఫోన్ లేకుండా తిండి తినడం లేదు. ఎప్పుడూ.. ఫోనే.. మాన్పించలేక పోతున్నాం. ఏం చేయాలి? ఒక చిన్న పిల్లల మానసిక వైద్యుడి దగ్గర ఒక తల్లి ఆవేదన! చిన్నప్పుడు ఏడుపు మాన్పించడానికి చేసిన ఆ పనితో పాప పూర్తిగా ఫోనుకు బానిసై పోయింది.

● మా పాప సెల్‌ఫోన్ వాడుతున్నప్పటి నుంచి మా మాట వినడం తగ్గించింది. మొండిగా సమాధానమిస్తోంది. ఎవరితో ఫోన్‌లో మాట్లాడుతున్నావంటే చెప్పదు. గంటల కొద్దీ ఫోన్‌లోనే గడిపేస్తున్నది. మేమెప్పుడైనా ఊరెళ్తే ఇంట్లో ఒక్కతే ఉండాల్సి వస్తుందని మాతోనే వచ్చేది. ఇప్పుడు మేము ఎప్పుడు ఊరెళ్తామా అని ఎదురుచూస్తున్నట్టుగా ఆమె మాటలు ఉంటాయి. మా అమ్మాయికి ఎవరైనా ప్రేమికుడు ఉన్నారా? లేక ఆ వయసులో ఇలాంటి ప్రవర్తన సహజమేనా? రాత్రుల్లో కూడా సెల్‌ఫోన్ వినియోగిస్తుంటుంది. అసలు మా అమ్మాయి మొబైల్ నుంచి దూరం కావాలంటే ఏం చేయాలి?' సైకియాట్రిస్టు వద్ద ఓ తల్లి ఆవేదన - ఇలా చెప్పుకుంటూ పోతే సెల్‌ఫోన్, ప్రత్యేకించి స్మార్ట్ ఫోన్ వినియోగం వల్ల సమస్యలతో మానసిక వైద్యశాలలో నిండిపోతూ ఉన్నాయి. ఇబ్బడి ముబ్బడి మొబైల్ వినియోగం సమాజాన్నే ప్రమాదంలోకి నెడుతోంది.

● మా అబ్బాయికి మొబైల్ అలవాటైపోయింది. అది ఆపుదామంటే వాడు మాపైనే చేతులెత్తుతున్నాడు. ఇంట్లో ఉన్న వస్తువులను విసిరేస్తున్నాడు. రాత్రి 2, 3 అయినా మేల్కొనే మొబైల్‌లో ఏవో వీడియోలు చూస్తుంటాడు. ఓ రోజు వాడి ఫోన్ చెక్ చేస్తే అందులో అసభ్యకరమైన వీడియోలు ఉన్నాయి. వాడిని ఎలా మంచి ప్రవర్తనలోకి తీసుకురావాలి? అంటూ ఒక తండ్రి సైకియాట్రిస్టును ఆశ్రయించాడు.

● ఒకప్పుడు యువతపైనే ప్రభావం.. నేడు అన్ని వయసులవారూ...

● తగ్గించు కోకుంటే ప్రమాదమే అంటున్న నిపుణులు



మొబైల్ బానిసత్వం!

● ప్రతి ఒక్కరినీ ముంచేస్తున్న స్మార్ట్ ఫోన్లు

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మనిషి గుప్పెట్లో ఇమిడిపోయే చిన్న ఫోన్.. నేడు మనిషిని, ఏకంగా మొత్తం మానవ సమాజాన్నే తన గుప్పెట్లోకి తీసుకుంది. మనిషికి మనిషికి మధ్య సంబంధాలను, అనుబంధాలను తుంచేస్తోంది. చుట్టూ అందరూ ఉన్నా.. తనదైన మైకంతో ఒంటిరిని చేసేస్తోంది. ఆధునిక ప్రపంచపు అద్భుత ఆవిష్కరణగా ముందుకు వచ్చిన మొబైల్, ఇప్పుడు మహమ్మారిలా మనిషిని వెంటాడుతోంది. తాను చెప్పినట్లల్లా ఆడేలా బానిసను చేసుకుంటోంది.



● యువతపై 'నీలి' నీడ!

యువత భవిష్యత్తును నీలి నీడ నాశనం చేస్తోంది. స్మార్ట్‌ఫోన్ల నుంచి వచ్చే నీలి కాంతులు ఒకవైపు.. అసభ్యకర వీడియోలు మరోవైపు వారి ఆలోచనలను మానసికంగా, శారీరకంగా భ్రష్టు పట్టిస్తున్నాయి. 17- 24 ఏళ్ల మధ్య ఉన్న వారు 44 శాతం మంది, 25-34 మధ్య ఉన్న వారు 41 శాతం మంది అశ్లీల వీడియోలు చూస్తున్నట్టు ఓ సర్వే రిపోర్టు వెల్లడించింది. పరిస్థితిని అవగతం చేసుకోవడానికి ఈ గణాంకాలు సరిపోతాయి. గతంలో మార్కులు, ర్యాంకులు సాధించలేమని ఒత్తిడికి గురయ్యే యువత ఇప్పుడు క్షణకాలం ఫోన్లు ఆగినా, పెద్దలు ఆపేసినా గందరగోళానికి గురవుతున్నట్లు మానసిక నిపుణులు చెబుతున్నారు. సెల్‌ఫోన్ వాడొద్దని షరతులు విధిస్తే ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనకాడటం లేదని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉంటేనే పిల్లల్లో మార్పు తీసుకురాగలమని సైకాలజిస్టులు సూచించారు. చిన్నారులు, యువకులే కాకుండా పెద్దవారిని సైతం మొబైల్ ఫోన్ వీడడం లేదు. ఆధ్యాత్మిక కార్యక్రమాలో, భక్తి పాటలో ఏవో ఒకటి మొబైల్‌లో చూసుకుంటూ వారూ కాలక్షేపం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోందని చెబుతున్నారు.

ఫోన్లు పిల్లల ప్రాణాలకు శాపాలు

ఆర్. పవిత్ర కన్సల్టెంట్ సైక్రియాటిస్ట్, పల్నాడు జిల్లా



రెండేళ్లలోపు పిల్లలకు ఫోన్ అనేదే ఇవ్వకూడదు. రెండేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు అర్ధగంట కంటే తక్కువ సమయం ఇవ్వాలి. సాధ్యమైనంత వరకూ తల్లిదండ్రులు, నాన్నమ్మ, తాతయ్యలు దగ్గరకు తీసుకోవాలి. వారితో ఎక్కువ సమయం గడపాలి. వారికి కబుర్లు, కథలు చెప్పాలి. దగ్గరుండి వారిని మిగిలిన పిల్లలతో కలిసి ఆడుకునేలా చేయాలి. ఫోన్ వాడే సమయంలో పేరెంటల్ కంట్రోల్ తప్పనిసరిగా ఉండాలి.

తీవ్ర మానసిక సమస్యలు..

వీ వెంకట కిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

ఎక్కువ సేపు ఫోన్ చూడడం ద్వారా మెదడులో డొపమైన్ విపరీతంగా ఉత్పత్తి అవుతుం ది. దాన్ని వినియోగించుకోలేక పోతే అది అస్తవ్యస్తంగా మారుతుంది. ఆ కారణంగా మానసిక సమస్యలు వస్తాయి. ప్రధానంగా నిద్రలేమి, ఏకాగ్రత కొరవడడం, క్షణికావేశం, విచక్షణ కోల్పోవడం, ఆత్మహత్య ఆలోచనలు, ఏడీహెచ్‌డీ, ఆటిజం వంటి సమస్యలు తలెత్తు తాయి. ఆ కారణంగా కొద్ది సేపు ఫోనుకు దూర మైనా చచ్చిపోవాలనే స్థితికి వచ్చేస్తారు. ప్రస్తుతం చిన్నారులు మొదలు, పెద్దవారి వరకూ ఈ లక్షణాలు కనిపిస్తు న్నాయి. మొబైల్ నుంచి క్రమ పద్ధతిలో దూరమవ్వకపోతే అనర్థాలు తప్పవు.



● ఎలా బయటపడాలి?

మొబైల్ మేనియా నుంచి బయటపడాలంటే స్వీయ నియంత్రణ అనేది చాలా ముఖ్యం. ఎవరైనా అశ్లీల వీడియోలకు అడిక్ట్ అయి ఉంటే వారు మొదటగా ఆ విషయాన్ని తమలో తాము ఒప్పుకోవాలి. తమలో వచ్చిన మార్పులను గ్రహించాలి. రోజులో వారు ఎంత సమయం ఎటువంటి యాక్టివిటీస్‌కు వినియోగిస్తున్నామో పేపర్‌పై రాసుకోవాలి. మనం చేయాల్సిన పనిని రద్దు చేసుకుని మరీ సెల్‌ఫోన్‌లోనే గడిపేస్తున్నామా? అనేది ఆలోచించాలి. ఇటువంటి ప్రవర్తనతో వచ్చే ప్రతికూల పరిస్థితులను బేరీజు వేసుకోవాలి. ఈ సమయంలో అడిక్షన్ నుంచి బయటపడడానికి మార్గాలు వెతుక్కోవాలి. చాలా వరకు ఒత్తిడితో ఉండే వాళ్లు, ఖాళీ సమయం ఎక్కువగా ఉన్నవాళ్లు ఆ సమయంలో ఇటువంటి విషయాల బారినపడుతుంటారు. ఎందుకంటే అన్నింటిలో కన్నా సెక్స్ అనేది చాలా సంతోషకరమైన ప్రక్రియ. ఇలాంటి పరిస్థితుల్లో మొబైల్ డేటా తగ్గించుకోవడం, అశ్లీల యాక్టివిటీ సదుపాయాలను రద్దు చేసుకోవడం చేయాలి. ఇది నెమ్మదిగా జరిగే ప్రక్రియ. ఖాళీ సమయాల్లో తమకు నచ్చిన ఇతర అభిరుచులు సంగీతం, డ్యాన్స్, ఇతరాత్ర పనులపై ఆలోచనలు సాగేలా దృష్టి కేంద్రీకరించాలి. ఇంకా కుదరని పక్షంలో సైకాలజిస్టును సంప్రదిస్తే మంచి ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.



అనుమతిస్తే.. అమ్ముకుంటాం

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వం అన్నదాతలకు చుక్కలు చూపించడం ఒక ఎత్తయితే నగదు జమ విషయంలో నెలల తరబడి ఎదురుచూడలేక దళారులనే ఎక్కువగా ఆశ్రయించారు. దీనికి తోడు బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధర కూడా కొంతమేర ఆశాజనకంగా ఉండడం ఇవన్నీ కూడా గత రెండేళ్లలో సేకరణ అంతంతమాత్రంగా జరిగింది. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు విషయాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుంది. ఈ మేరకు చర్యలు చేపడుతుండడంతో సహజంగానే కొనుగోలు కేందాలకు వచ్చే ధాన్యం పరిమాణం పెరిగింది. 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం, తేమశాతంతో పాటు ఇతర నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించాలనే ప్రభుత్వ సూచనలు అమలు జరగడం వంటివన్నీ కూడా ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల బాట పట్టడానికి కారణమైంది.

అంచనా వేయడంలో విఫలం..

ధాన్యం సేకరణ లక్ష్యం విషయంలో ప్రభుత్వం సరైన అంచనా వేయలేకపోయింది. ఉదాహరణకు బాపట్ల జిల్లాలోనే దాదాపు 5 లక్షల టన్నుల దాకా దిగుబడి ఉంటోంది. ఈ జిల్లాలో అతి స్వల్పంగా లక్ష్యం 50,000 కే పరిమితం చేసింది. ఇదే పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లోనూ నెలకొంది. బాపట్ల జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 50,000 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించగా, దాదాపు రెండు లక్షల టన్నుల వరకు ధాన్యం ఇప్పటికే బహిరంగ మార్కెట్‌కు తరలినట్లు క్షేత్రస్థాయి గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఇంకో లక్షన్నర టన్నుల వరకు గోడౌన్‌లతో పాటు మిల్లుల్లో అన్నదాతలు నిల్వ చేసుకున్నారు. చాలా వరకు రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పెట్టుబడి కోసం స్థానికంగా ఉండే వ్యాపారులను ఆశ్రయించడంతో, ఇప్పుడు ధాన్యాన్ని కూడా వారికే అమ్మకుని నిలువునా మోసానికి గురవుతున్నారు.

ధర మరింత పతనమయ్యే అవకాశం..

ఇన్ని రోజులూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం సేకరిస్తూ ఉండడంతో బహిరంగ మార్కెట్‌లో ధర రూ.1550కి అటూఇటూ ఉంటూ వస్తోంది. కానీ ఇప్పుడు లక్ష్యం పూర్తి కావడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మకాలు నిలిచిపోయాయి. ఇదే అదనుగా ధరను మరింత పతనమైంది. దళారులంతా సిండికేట్ అయి అన్నదాతలను వంచించే కుట్రకు తెరలేపారు. ఇప్పటికే క్వింటా ధాన్యం ధర రూ.1400కు తగ్గించి దళారులు అడుగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం వెంటనే అదనంగా ధాన్యం సేకరణకు అనుమతులిస్తే అటు రైతులకు మేలు జరగడంతో పాటు బయట మార్కెట్‌లో ధాన్యం ధర మరింత పతనమవకుండా కాపాడినట్లవుతోంది. ఈ పరిస్థితుల్లో వెంటనే మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మరో వైపు గతంలో వర్షాల సమయంలో ఉన్న ధాన్యాన్ని ముందుగా మిల్లులకు తరలించాలని ప్రభుత్వం సూచించింది. చాలా మంది రైతులు తేమ ఉన్నప్పటికీ ధాన్యాన్ని మిల్లులకు తరలించి నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం లక్ష్యం పూర్తి కావడంతో ఆ ధాన్యం సేకరణ విషయంలో మిల్లర్లు వెనకడుగు వేస్తున్నారు. కొనని కాడికి ఎందుకు నిల్వ చేసుకోనిచ్చారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 10,000 టన్నుల ధాన్యం మిల్లుల్లో ఈ ధాన్యం నిల్వ చేసి ఉన్నారు. ఈ ధాన్యం విషయంలో ప్రస్తుతం తకరారు నడుస్తోంది.

ముగిసిన ఉరుసు మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులోని శ్రీ హజరత్ కాలేమస్తాన్‌షా అవులియా(మస్తానయ్యదర్గా) 133వ ఉరుసు మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గత ఐదు రోజులుగా బాబా వారికి దీపారాధన, చాందిని అలంకరణ, శేషవస్త్రాల పంపిణీ, గంధం సమర్పణ, భక్తులకు అన్నదానం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం భక్తులు బాబావారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముగింపు మహోత్సవాల్లో భాగంగా బాబా సమాధిని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి దర్శించుకుని చద్దరును, గంధాన్ని సమర్పించారు. అనంతరం కన్నావారితోటలోని బాబా వారి ఆశీనులైన కుర్చీని యథా స్థానంలో ఉంచారు. దీంతో ఉరుసు ఉత్సవాలు ముగిశాయని దర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు.



ఫకీర్ల నుంచి ఆశీస్సులు పొందుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి

కన్నావారితోటలోని యథాస్థానంలోకి బాబా కుర్చీ



మస్తాన్‌బాబా సమాధిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

రక్తహీనతను అధిగమించాలంటే పౌష్టికాహారం

ఆరోగ్యంగా ఉండాలంటే సరైన తిండి, సరిపడా నిద్ర చాలా ముఖ్యం. ఈ రెండు విషయాలను నిర్లక్ష్యం చేస్తే, వాటి ప్రభావం వారి భవిష్యత్తు జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా కౌమార దశలోని బాలికలు, గర్భిణులు రక్తహీనత సమస్య బారినపడ కుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు పాటించక తప్పదు. పౌష్టికాహారం, నిద్ర చక్కగా ఉండాలని, ఈ రెండింటిపై ఎంత శ్రద్ధ పెడితే అంత ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు.

- కౌమార దశలోని బాలికల్లో, గర్భిణుల్లో అనారోగ్య సమస్యలు
- ఆకలిని చంపేస్తున్న జంక్‌ఫుడ్
- సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తూ నిద్రకు దూరం
- తగినంత తిండీనిద్ర తప్పనిసరంటున్న వైద్యులు

సత్తెనపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కౌమార దశలో బాలికలు, ఇంటర్ విద్యార్థినులు ఆరోగ్య సమస్యలతో ముఖ్యంగా విపరీతమైన కడుపునొప్పి, రుతుచక్రం సరిగా జరగక పోవడం, రక్తహీనత వంటి సమస్యలతో సతమతమవుతుంటారు. చాలామంది గర్భిణులు కూడా రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. ఇందుకు ముఖ్యకారణం పౌష్టికాహార లోపం. సమయానికి ఆహారం తీసుకోవాలని, తగినన్ని గంటలు నిద్ర పోని పక్షంలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. సత్తెనపల్లి పట్టణంలోని ఏరియా వైద్యశాలకు రక్తహీనతతో ఉన్న బాలి కల కేసులు, గర్భిణుల కేసులు వస్తున్నాయి. కేవలం, ఏరియా వైద్యశాలకు కాకుండానే పలు ప్రైవేట్ వైద్యశాలలకు కూడా ఈ తరహా కేసులు వస్తున్నాయి. రక్తహీనతను తట్టుకుని ముందుకు వెళ్లాలంటే పౌష్టికాహారం కీలకం అనే విషయాన్ని విస్మరిస్తున్నారు. పాఠశాల, కళాశాల విద్య కోసం దూర ప్రాంతానికి వెళ్లే బాలికలు, గ్రామాల్లో పొలం పనులకు వెళ్లే గర్భిణులు పౌష్టికాహారంవిషయంలో ఏమా త్రం శ్రద్ధపెట్టడం లేదు. చిరు తిండ్లు, జంక్‌ఫుడ్ కేకులు, పానీపూరీ, నూడిల్స్ వంటివి ముఖ్యంగా బాలి కలు తీసుకుంటు న్నారు. ఇవి తిన్నాక ఆకలి చచ్చిపోతుంది. దీంతో, రాత్రి భోజనం మానేస్తున్నారు. ఇదే పొరపాటు కొన్ని నెలల పాటు చేస్తే అలవాటు గా మారి అది అనారోగ్యానికి దారితీస్తుంది. ఆ ప్రభావం కొందరి పై పెళ్ళికి ముందు, ఇంకొందరికి పెళ్ళి అయిన తరువాత కన్పిస్తుంది.

ఆహారంతో పాటు నిద్ర విషయంలోనూ ఇదే తప్పు చేస్తున్నారు. టీవీలు, సెల్ ఫోన్‌లతో కాలక్షేపం చేస్తూ సమయానికి నిద్ర పోవడం లేదు. చాలా మంది పిల్లలు మామూలు సమయం కన్నా స్క్రీన్ సమయం ఎక్కువ నమోదవ్వడం భవిష్యత్ ప్రమాదాన్ని హెచ్చరిస్తుంది. ప్రతి ఒక్కరు కనీసం ఏడు గంటలు నిద్రపోతేనే ఆరోగ్యమని వైద్యులు చెబుతున్నారు. సెల్ ఫోన్‌లు, టీవీలకు, సోషల్‌మీడియాకు అతుక్కుపోవడం వల్ల అనేక మందికి కళ్ళ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రాథమికదశలో సమస్యను ఎదుర్కొన్న వాళ్లలో కొద్దోగొప్పో జాగ్రత్తపడుతున్నారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

డాక్టర్ జీ అరుణ, గైనకాలజిస్టు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి




కౌమార దశలో ఉన్న ఆడపిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. ముఖ్యంగా వారు తీసుకొనే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. సమయానికి పౌష్టికా హారం అందించాలి. శారీరక శ్రమ వారిలో లోపిస్తుంది. ఇంటికి వచ్చిన తరువాత ఇంటి పనులు, వంట పనుల్లో సహ కారం అందించేలా బాలికలను వారి తల్లులు ప్రోత్సహించాలి. అప్పుడే వారు శారీరకశ్రమతో ఆరోగ్యంగా ఉంటారు. చదువే ముఖ్యం కాదు. ఆరోగ్యం అంతకన్నా ముఖ్యం. రక్తహీనత, రుతుక్రమం వంటి సమస్యలతో కొంత మంది విద్యార్థినులు వైద్యశాలకు వస్తున్నారు. వారికి మందుల చీటి రాయడం అంటే కాస్త బాధగానే ఉంటుంది. ఫాస్ట్, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని గర్భిణులు

గర్భిణుల్లో 40 మందికి రక్తహీనత

డాక్టర్ లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రతి నెలా 120 నుంచి 130 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. వీరిలో 40 మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతుండటం గుర్తించాం. అవసరమైన వారికి రక్తం ఎక్కించి కాన్పులు చేస్తున్నాం. యుక్త వయస్సులోని విద్యార్థినిలు కూడా రక్త హీన తతో బాధపడుతూ ఆసుపత్రికి వస్తున్నారు. వారికి ఐరన్ మాత్రలు అందించడంతో పాటు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి తెలియ జేస్తున్నాం.

తుదిపోరుకు ప్రీమియర్ లీగ్ పోటీలు

రేపు ఫైనల్స్... బహుమతుల ప్రదానం

మంగళగిరి సిటీ(నవులూరు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి మండలం నవులూరు అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. బుధవారం నెల్లూరు-కడప, గుంటూరు-విజయనగరం జట్లు తలపడనున్నాయి. 23న ఉదయం ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులను అందజేస్తారు. ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు.

ప్రీమియర్ లీగ్‌కు అపూర్వ స్పందన

ఇప్పటివరకు మంగళగిరి నియోజకవర్గానికే పరిమితమైన ఎంపీఎల్ పోటీలు ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి జట్లను ఆహ్వానించారు. పోటీలను సైతం అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో నిర్వహించడంతో ప్రేక్షకులు, క్రీడాభిమానుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ నెల 12 నుంచి జరుగుతున్న పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 13 జట్లతోపాటు మంగళగిరి నుంచి ప్రత్యేకంగా ఓ జట్టు కూడా పాల్గొంది. రోజుకు రెండు మ్యాచ్‌ల చొప్పున జరిగాయి. అభివృద్ధి, సంక్షేమంతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని భావించిన మంత్రి నారా లోకేశ్ మంగళగిరిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట సొంత నిధులతో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. మంగళగిరి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించి, వారికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా లోకేశ్ కృషి చేస్తున్నారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో క్రీడా మైదానాలను కూడా ఏర్పాటు చేశారు. త్వరలో ప్రభుత్వ సహకారంతో మంగళగిరిలో అన్ని వసతులతో కూడిన క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. పోటీల్లో ప్రతి క్రీడాకారుడికి అన్ని సదుపాయాలతోపాటు దుస్తులను మంత్రి లోకేశ్ అందజేస్తున్నారు. దాతల సహకారంతో ప్రైజ్ మనీ, ట్రోఫీలు కూడా ఇస్తున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో మంగళగిరి నుంచి పాల్గొనే క్రీడాకారులకు ఆర్థికంగా సహాయ సహకారాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.



కలెక్టర్ వెంకటమురళితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వండి

కలెక్టర్‌తో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో తాగునీరు, డ్రైన్లు, రోడ్లు తదితర సమస్యల పరిష్కారంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మంగళవారం కలెక్టర్ జె.వెంకటమురళిని కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై వారివురి మధ్య చర్చ జరిగింది. ముందుగా ఎమ్మెల్యే కొండయ్య కలెక్టర్ వెంకటమురళికి మర్యాద పూర్వకంగా బొకే అందజేశారు.

24న చేనేత సమస్యలపై ఆందోళన

చీరాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : హ్యాండ్లూమ్ ఏడీ కార్యాలయం వద్ద చేనేత రంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 24వ తేదీన ఆందోళన చేపట్టనున్నట్లు చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు మంగళవారం తెలిపారు.

స్వచ్ఛత కరువు

- నినాదాలకే పరిమితమైన లక్ష్యం
- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- రోడ్డు మార్జిన్‌లే డంపింగ్ యార్డ్‌లు
- తీవ్రమైన కంపుతో వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



నాగులపాలెంలో ముళ్ల చెట్లతో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం



ప్రధాన రహదారి మార్జిన్‌లో కుప్పలుగా ఉన్న వ్యర్థాలు

పర్చూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ భారత్ నినాదాలు మాటలకే పరిమితమవుతున్నాయి. గ్రామాల్లో స్వచ్ఛత కరవవుతోంది. చెత్త నుంచి సంపదను సృష్టించాలన్న సంకల్పంతో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన సంపద కేంద్రాలు (డంపింగ్ యార్డ్‌లు) నేడు నిరుపయోగంగా మారాయి. చెత్త సంపద కేంద్రాలను నిర్మించారే తప్ప వాటిని వినియోగంలోకి తెచ్చిన దాఖలాలు లేవు. ప్రస్తుతం అవి ముళ్లచెట్లు, పొదలతో దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి నిర్మాణం చేసిన డంపింగ్ యార్డులు వినియోగంలోకి రాకపోవడంతో కొన్ని చోట్ల అవికాస్త శిథిలావస్థకు చేరుకున్నాయి. గ్రామాల్లో ఆయా పంచాయతీల ద్వారా పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను వాహనాల ద్వారా రోడ్డు మార్జిన్‌లలో పడేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రధాన రోడ్ల మార్జిన్‌లు డంపింగ్ యార్డ్‌లను తలపిస్తున్నాయి. పైగా ఆ మార్గాల్లో వెళ్లే ప్రయాణికులు తీవ్రమైన కంపుతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రోడ్డు మార్జిన్‌లో పెద్ద ఎత్తతన చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. చెత్తను తగులబెట్టే క్రమంలో ఒక్కసారిగా దట్టమైన పొగ వ్యాపించడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. పర్చూరు నుంచి చీరాల, పర్చూరు నుంచి ఇంకొల్లు, యద్దనపూడి వెళ్లే ప్రధాన రహదారుల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా మారింది. లక్షలు వెచ్చింది నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను అలా నిరుపయోగంగా వదిలేశారని, దీంతో చెత్త శుద్ధి లక్ష్యం నీరుగారిపోతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నచిన్న మరమ్మతులతో దానిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. పర్చూరులో మాత్రం డంపింగ్ యార్డ్‌ను తాటాకుల షెడ్‌తో సరిపెట్టి మమ అనిపించారే తప్ప పూర్తి స్థాయిలో నిర్మించలేదు. అడుసుమల్లి, నాగులపాలెం, నూతలపాడు, చెరుకూరు, రమణాయపాలెం తదితర గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను నిర్మించారే తప్ప వినియోగించడం లేదు. ఏళ్ల తరబడి నిర్మాణం చేసిన డంపిగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీటిపై దృష్టిసారించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవడంతోపాటు మెరుగైన పారిశుధ్య కార్యక్రమాల ద్వారా ప్రజల ఆరోగ్యప్రజలకు మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజారోగ్యం అన్న విషయాన్ని అధికారులు గుర్తెరిగి తక్షణ చర్యలు చేపట్టి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు వచ్చి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.



పర్చూరులో రూపుదిద్దుకుంటున్న శ్రీ అష్టలక్ష్మి ఆలయం

31న అష్టలక్ష్మి ఆలయ ప్రతిష్ఠోత్సవం

- రూ.4కోట్ల దాతల సహకారంతో నిర్మాణం
- హాజరుకానున్న దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి

పర్చూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారం రూ.4కోట్ల వ్యయంతో పర్చూరులోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ సమీపంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయం రూపుదిద్దుకుంటుంది. ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈనెల 31న ఆలయ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి పాబోలు వెంకట సత్యనారాయణ తెలిపారు. కారర్యక్రమానికి అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామితోపాటు, శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామి హాజరు కానున్నారు. పలు అభిషేకాలతోపాటు మహా కుంభాభిషేకం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

మార్టూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేక పోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో వై.శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 21 మంది సభ్యులకు గాను నలుగురు మాత్రమే హాజరు కావడంతో మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేని కారణంగా వాయిదా వేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.



విజయలక్ష్మిపురం గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళిక

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విజయలక్ష్మిపురంలో గ్రామస్థులకు తాగునీటి సమస్య పరిష్కారానికి, సీసీ రోడ్ల నిర్మాణానికి తగిన ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు గ్రామస్థులకు తెలిపారు. మంగళవారం ఆయన, తహసీల్దార్ గోపీకృష్ణతో కలసి విజయలక్ష్మిపురంలో పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో విఆర్వో, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

సీఐ సుబ్బరాజు



మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, జనవరి21(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలను పాటించటం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని సీఐ సుబ్బరాజు అన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక గ్యారేజీలో ఆర్టీసీ డ్రైవర్‌లు, కండక్టర్‌లు, మెకానిక్‌లు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బరాజు మాట్లాడుతూ రోడ్డు మీద వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ప్రయాణికులను ఎక్కించుకునేటప్పుడు రోడ్డు మార్జిన్‌లో నిలపాలన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించడం సురక్షితమన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు, అసిస్టెంట్ మేనేజర్ మహబూబి, అశోక్‌లైలాండ్ శిక్షణాధికారి మురళి, ఎంఎఫ్ బాబ్జీ, కార్మికులు పాల్గొన్నారు.



జడ్పీటీసీ సభ్యుని కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

సుబ్బయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న బలరాం, బూచేపల్లి

బల్లికురవ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి బల్లికురవ మండల జడ్పీటీసీ సభ్యులు చింతల అంజలి శ్రీనివాసరావు తండ్రి సుబ్బయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జడ్పీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శించి సుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన టీడీపీ, వైసీపీ పార్టీలకు చెందిన నేతలు సుబ్బయ్య మృతదేహాన్ని సందర్శించి నవాళులర్పించారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

పంగులూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జార్లమూడివారిపాలెం గ్రామంలోని రామాలయంలో శాప్ చైర్మన్ రవినాయుడు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు గరిమిడి జగన్మోహనరావు, నేతలు జాగర్లమూడి శ్రీనివాసరావు, ధూళిపాళ్ల అవినాష్, బీజేపీ నాయకులు జాగర్లమూడి ఎలమందరావు, పూర్ణ, విజయ్ ఉన్నారు.

చెత్త సమస్యను తొలగించాలని విజ్ఞప్తి



వినతిపత్రం అందజేస్తున్న పేరాల కారెంపూడివారి వీధికి చెందిన మహిళలు

చీరాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పేరాల కారంపూడివారి వీధికి చెందిన పలువురు మహిళలు మంగళవారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌ను కలసి వినితిపత్రం అందజేశారు. చెత్త సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ జంజనం వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. పట్టణంలో కూడా ఎక్కడ కూడా పారిశుధ్యానికి సంబంధించి అశ్రద్ధ చేయవద్దని స్పష్టం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ సిబ్బందికి ఆ ప్రాంతానికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. మురుగు కాలువలో తీసిన మట్టిని ఒకరోజు ఎండబెట్టాలన్న ఉద్దేశంతో అలా ఉంచారని, బుధవారం తొలగిస్తారని స్థానికులకు చెప్పారు.

ఏబీసీలో పడిపోయిన నీటి మట్టం

- ఎగువ భాగంలో తగ్గించారంటున్న అధికారులు
- ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలంటున్న రైతులు



ఏబీసీ కాలువకు తక్కువగా వస్తున్న నీరు

బల్లికురవ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచ్ కెనాల్ కాలువలో నీటి మట్టం పడి పోయింది. ఎగువ భాగంలో నీటిని అధికారులు నిలుపుదల చేయించడంతో మంగళవారం ఏబీసీలో నీరు అడుగుకు చేరింది. ఇప్పుడు వచ్చే నీరు మేజర్‌లకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. రెండు రోజుల నుంచి నీరు రావడం తగ్గిందని అధికారులు మాత్రం పై భాగంలో నీటిని నిలిపి వేశారని, రెండు రోజుల్లో మరలా నీరు వస్తుందని చెప్తున్నారని, ఇప్పుడు నీటి విడుదల నిలిపివేస్తే పంటలు బెట్టకు వస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని 33వ మైలు వల్లాపల్లి లాకుల వద్దకు రెండు అడుగుల మేర కూడా నీరు రావడం లేదని రైతులు తెలిపారు. అధికారులు వెంటనే సాగర్ నీటిని ఏబీసీకి విడుదల చేయాలని లేకుంటే పంటలు దెబ్బ తింటాయని రైతులు తెలిపారు. వరి, మొక్కజొన్న పంటలు సాగులో ఉన్నాయని రైతులు తెలిపారు.

పశు పోషణలో వైద్యుల సూచనలు పాటించాలి



గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి మురళీకృష్ణ

పంగులూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు పశు పోషణలో వైద్యుల సూచనలు పాటించాలని పశువైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని బూదవాడ, రేణంగివరం గ్రామాలలో మంగళవారం పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందుతాగించారు. గేదెలకు, ఆవులకు సూడి పరీక్షలు నిర్వహించి ఎద ఇంజక్షన్లు చేశారు. రేణంగివరంలో డాక్టర్ సైదయ్య పశువులకు వైద్యం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఓబుల్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోనె సంచులు తెచ్చుకుంటే డబ్బులిస్తాం



ధాన్యాన్ని తూకం వేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

వేటపాలెం(చీరాల), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మాగాణి సాగు చేసిన రైతులు తమ ధాన్యాన్ని మిల్లులో విక్రయించుకునేందుకు అవసరమైన గోనె సంచులు మిల్లులో ఉచితంగా ఇస్తారని, మీరే తెచ్చుకుంటే వాటి ధరను ప్రభుత్వం చెల్లిస్తుంది ఏవో కాశీవిశ్వనాథ్ తెలిపారు. మండల పరిధిలో దేశాయిపేటలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జగన్మోహనరావు అనే రైతు చేలో ధాన్యం దిగుబడికి సంబంధించి చదరపు మీటరులో ఎంత ధాన్యం వచ్చింది తూకం వేసి లెక్కించారు. దాని ప్రకారం ఎకరాకు ఎంత దిగుబడి వస్తుందో లెక్కించారు. కార్యక్రమంలో ఏఇఓ జస్వంత్, వీఏఏలు మనీషా, కావ్య, రుఫియా, సరేనా, కుసుమ, టాటా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రావిపూడి హేతువాద ఉద్యమ కృషి చిరస్మరణీయం

ఇంకొల్లు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలం నాగండ్ల గ్రామానికి చెందిన రావిపూడి వెంకటాద్రి హేతువాద, మానవవాద ఉద్యమ కృషి చిరస్మరణీయమని రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ అధ్యక్షుడు మేడూరి సత్యనారాయణ అన్నారు. హ్యూమనిస్టు సెంటర్‌లో మంగళవారం ప్రముఖ హేతువాది రావిపూడి ద్వితీయ సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో భారతహేతువాద సంఘ ట్రెజరర్ షేక్ బాబు, ఏపీ హేతువాద సంఘ అధ్యక్షుడు కరణం రవీంద్రబాబు, ప్రధానకార్యదర్శి షేక్ దరియావలి, శేషయ్య, హేతువాదులు పాల్గొన్నారు. ముందుగా రావిపూడి చిత్రపటానికి నివాళులర్పించారు.అనంతరం మేడూరి రచించిన ప్రకృతి నియమబద్ధత గ్రంథాన్ని ప్రఫుల్ల చంద్ర ఆవిష్కరించారు.



రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

రామ్మూర్తి కృషి మరువలేనిది

అద్దంకిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి కోసం గానాల రామ్మూర్తి చేసిన కృషి మరువలేమని వక్తలు కొనియాడారు. మంగళవారం అద్దంకిలోని వుడ్ కాంప్లెక్స్ ఏరియాలో గానాల రామ్మూర్తి జయంతి వేడుకలను అద్దంకి పట్టణ వి శ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రామ్మూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇప్పటి వరకు రాజకీయంగా విశ్వబ్రాహ్మణులకు ఎటువంటి ప్రాధాన్యత లేదని, ఎంఎల్‌సీ ఇవ్వాలని బ్రహ్మానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవిచంద్ర, రామబ్రహ్మచారి, ఆంజనేయులు, వీర బ్రహ్మచారి, చిరంజీవి, గోవిందచారి, హరిబాబు, రమేష్, లలిత పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

అద్దంకిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదానం నిర్వహించారు. పట్టణంలోని నర్రావారిపాలెంకు చెందిన పూసపాటి శివపార్వతి వైద్యులు ఓ పాజిటివ్ రక్తం ఎక్కించాలని చెప్పగా వారి కుటుంబ సభ్యులు రోటరీ క్లబ్ బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ చుండూరి మురళీ సుధాకరరావును ఆశ్రయించారు. దీంతో అద్దంకిలోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వర్లును ప్రోత్సహించి రక్తదానం చేయించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొని రక్తదాతను, పోత్సహించిన వారిని అభినందించారు.

15 మంది ఉద్యోగాలకు ఎంపిక

అద్దంకిటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెఆర్ ఎంప్లాయిమెంట్ రాజారావు హాజరై నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహించే జాబ్ మేళాలు, శిక్షణ తరగతులను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాకు అరబిందో ఫార్మా, ఇలలాగిరి సొల్యూషన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. జాబ్ మేళాలకు 60 మంది నిరుద్యోగులు హాజరు కాగా, వారిలో 15మంది ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ లాజరస్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, సీనియర్ లెక్చరర్ డాక్టర్ రాజకుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ గోపినాథ్ పాల్గొన్నారు.

నిపుణుల సలహా మేరకే కలుపు మందు వాడాలి

ఏడీఏ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు

పంగులూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పంట సాగులో కలుపు మందు నిపుణుల సూచనల మేరకే వాడాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు సూచించారు. బైటమంజులూరు, ముప్పవరం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కలుపు మందు విచక్షణారహితంగా వాడితే పంటతో పాటు భూమికి నష్టం వాటిల్లుతుందన్నారు. గ్రామాలలో సాగులో ఉన్న మొక్కజొన్న పంటను స్థానిక అధికారులు, రైతులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, సర్పంచ్ రౌతు సాంబశివరావు, పృధ్వీ సాయి, దిల్లా, శివరామరాజు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో సస్య రక్షణ

చర్యలు చేపట్టాలి

అద్దంకిటౌన్ : మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం, విప్పర్లవారిపాలెం గ్రామాలలోల పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతు మొక్కజొన్నలో కత్తెర పురుగును గమనించి, దాని నివారణ కోసం ఎమామెక్టిన్ బెంజోఏట్ 100 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలు రాయితీపై అందిస్తున్నట్లు ఉద్యాన అధికారి ఎస్.దీప్తి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాకనాటి అంజిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సీత పాల్గొన్నారు.

రైతులు పొలాన్ని చూపించాలి

మేదరమెట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రీ-సర్వే జరుగుతున్నందున అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు రైతులు అందుబాటులో ఉండి పొలాన్ని చూపించాలని సర్వేయర్ మహేష్‌బాబు తెలిపారు. మంగళవారం ధైవాలరావూరులో నాలుగు బృందాలు రీ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఒక్కో బృందంలో సర్వేయర్, వీఆర్వో ఇతర అధికారులు ఉన్నారు. వీరంతా సర్వే నెంబర్ల వారీగా రోజు 20 లేదా 25 ఎకరాలను పరిశీలించి, రైతులతో మాట్లాడి పేర్లను నమోదు చేసుకుంటున్నారు. తమవద్ద ఉన్న రికార్డుతో రైతులు చెప్పే సమాచారాన్ని పోల్చి చూస్తున్నారు. రైతులు పూర్తి సమాచారంతో అధికారులు పిలిచినప్పుడు పొలం వద్దకు వస్తే రీసర్వే తొందరగా పూర్తవుతుందని మహేష్‌బాబు అన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు రాజు, నరసింహారావు, సర్వేయర్లు ఇమ్మానియేల్, వైష్ణవి, సుబ్బరావు పాల్గొన్నారు.



ధైవాలరావూరులో రీ సర్వే చేస్తున్న అధికారులు